క్లుప్తంగా

సూర్యదేవుని గ్రామోత్సవం



గోపాలపురంలో సూర్యనారాయణ స్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

గోకవరం: మండలంలోని గోపాలపురం గ్రామంలో సనాతన ధర్మ ప్రభోధనా స్వచ్ఛంద సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఉషా పద్మినీ ఛాయా సమేత సూర్యనారాయణ స్వామి గ్రామోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని వీధుల్లో ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబు, ఉపాధ్యక్షుడు అక్షింతల రాజా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సూర్యనమస్కారాలు ఆచరించాలన్నారు. గ్రామోత్సవంలో దోసపాటి సుబ్బారావు, పిల్లంగోరు పాపారావు, చింతల సుబ్బారావు, చింతల చిన్నకాపు, సీతయ్య, గూడవల్లి సతీష్, కాసాని ఏడుకొండలు, వీరవల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయక్

సీతానగరం: మండల గ్రామాల్లో జరిగిన ఎన్ఆర్ఈజీఎస్ పనులపై 16వ విడత సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నామని సోషల్ ఆడిట్ స్టేట్ రిసోర్స్ పర్సన్ నాయక్ తెలిపారు. మంగళవారం సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లకు సామాజిక తనిఖీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్పీ నాయక్ మాట్లాడుతూ 2023–24 ఏడాదిలో ఎన్ఆర్ఈజీఎస్ పనులు చేసిన గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహిస్తామన్నారు. ఇప్పటి నుంచి వచ్చే నెల ఐదో తేదీ వరకూ 10 టీమ్‌లు మండల గ్రామాల్లో తనిఖీ చేపడతారన్నారు. ఏపీఓ నాగ శేషవేణి మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ పనుల్లో పంట కాలువ పూడికతీత పనులు, బోదెలు ఏర్పాటు, చెరువుల పూడిక తీత, గట్లు బలపర్చడం, గ్రామాలో పలు రకాలైన పనులు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వి.అవినాష్, హౌసింగ్ ఏఈ ఎ.రామారావు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న జెస్సీఫ్లోరెన్స్

రంగంపేట: విద్యార్థినులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ జె.జెస్సీఫ్లోరెన్స్ సూచించారు. మండల కేంద్రమైన రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆమె బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల అక్రమ రవాణా, హక్కులు, బాల్య వివాహాలు, పోక్సో చట్టాలపై అవగాహన పెంచుకుని, చట్టాల అమలు ద్వారా రక్షణ పొందడానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం వి.పార్థసారథి, ఉపాధ్యాయులు రాజేశ్వరి, స్వాతి మయూరి, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు కె.వాణి, షేక్ బేగం, బాలల పరిరక్షణ విభాగం సామాజిక కార్యకర్త కె.శిరీష, అంగన్‌వాడీ కార్యకర్తలు జానకి, అమ్మాజీ, పుష్ప పాల్గొన్నారు.

తాగునీరు సరఫరాపై పర్యవేక్షణ



కైకవోలులో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆశాజ్యోతి

పెదపూడి: స్వచ్ఛమైన తాగునీరు సరఫరాపై ఇంజినీరింగ్ అసిస్టెంట్ల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని ఎంపీడీఓ పి.ఆశాజ్యోతి తెలిపారు. ఆమె కై కవోలు, కుమారప్రియం గ్రామాల్లోని మంగళవారం పర్యటించి వాటర్ ట్యాంకుల వద్ద పిచ్చి మొక్కలు, పొదలు తొలగించాలని, ప్రజలకు సరఫరా చేస్తున్న నీటిని క్లోరినేషన్ చేశారా లేదా అని వాటర్ పరీక్ష చేయించాలన్నారు. అలాగే ఆయా గ్రామాల్లో ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందితో ఆమె మాట్లాడారు. వాతావరణంలో మార్పులు కారణంగా అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. ప్రజలకు సరఫరా చేసే తాగునీటిని ప్రతి రోజు క్లోరినేషన్ చేసి సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగాధర్ ఈఓపీఆర్డీ ఎంసత్యనారాయణ రెడ్డి, సచివాలయం కార్యదర్శులు తరుణ్, చిన్ని, తదితరులు పాల్గొన్నారు.

ఖర్చు ఆదా.. దిగుబడి అధికం

- డ్రమ్ముసీడర్‌తో వరినాట్లు
- తక్కువ సమయంలో ఎక్కువ పని
- కూలీలు, నీటి సమస్యలు అధిగమించవచ్చని చెబుతున్న కేవీకే శాస్త్రవేత్తలు



డ్రమ్ము సీడర్ పరికరంతో వరి విత్తనాలు చల్లే విధానం

రాజానగరం: ఖరీఫ్‌లో వరి సాగులో డ్రమ్ము సీడర్ ఎంతో ఉపయోకరంగా ఉంటున్నాయి. వీటి వవల్ల సమయం, ఖర్చు ఆదా, అధిక దిగుబడి పొంద వచ్చని కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఆధునిక సాంకేతిక విజ్ఞానంతో విత్తన శుద్ధి మొదలుకొని వరి కోత కోసి, నూర్పేవరకూ అన్ని దశల్లోను నేడు యంత్రాల వినియోగం పెరిగింది. అయితే నారుమడి వేయడం, ఆకు తీయడం, నాట్లు వేయడం వంటి ప్రక్రియలలో చాలా మంది రైతులు ఇప్పటికే యంత్రాలను వినియోగిస్తున్నారు. అయితే డ్రమ్ము సీడర్‌తో వీటిని కూడా అధిగమించవచ్చని కేవీకే సేద్య పంటల విభాగం రిటైర్డ్ అధికారి ఎస్.జితేంద్రనాథ్ ఇందుకు సంబంధించిన వివరాలను తెలియజేశారు.

డ్రమ్ము సీడర్‌తో మంచి ఫలితాలు

డ్రమ్ము సీడర్ పరికరంతో మొలకెత్తిన వరి విత్తనాలను నేరుగా పొలాల్లో విత్తడం ద్వారా పంట త్వరగా కోతకు రావడంతోపాటు ఖర్చు కూడా తగ్గుతుంది. దిగుబడి 5 నుంచి 10 శాతం వరకు పెరుగుతుంది. గత దశాబ్దకాలంగా కేవీకే ద్వారా జిల్లాలోని వివిధ గ్రామాల్లో ఈ పద్ధతిలో అనేక ప్రదర్శనా క్షేత్రాలను ఏర్పాటు చేసి వరి సాగులో మంచి ఫలితాలు చవిచూసింది. ఈ పరికరం ఖరీదు రూ.4,888 కాగా సబ్సిడీపై రూ. 2444 లకే కేవీకేలో అందజేస్తున్నారు.

కలుపు నివారణ

డ్రమ్ము సీడరుతో విత్తిన పొలంలో వరి, కలుపు మొక్కలు ఒకేసారి మొలుస్తాయి. ఈ కారణంగా విత్తిన 20 రోజుల వరకు చేతితో కలుపు తీయడానికి వీలుపడదు. కాబట్టి కలుపు నివారణకు తప్పనిసరిగా రసాయన మందులు వాడాలి. గడ్డి జాతుల మొక్కలుంటే బ్యూటాక్లోర్ 50 శాతం ఒక లీటరు లేదా అనిలోఫాస్ 30 శాతం 500 మిల్లీలీటర్లు. లేదా ప్రిటిలాక్లోర్ 50 శాతం 500 మిల్లీలీటర్లు. ఏదో ఒక దానిని ఎకరానికి 25 కిలోల పొడి ఇసుకలో కలిపి, నాటిన మూడు నుండి ఐదు రోజులలో పలుచగా నీరు పెట్టి సమానంగా వెదజల్లాలి. నాటిన 25 నుండి 30 రోజల వ్యవధిలో పొలంలో వెడల్పాటి కలుపు మొక్కల ఉధృతి ఎక్కవగా ఉంటే ఎకరానికి 400 గ్రాములు 2 లేదా 4 డీ సోడియం సాల్ట్ 80 శాతం పొడి మందును 200 లీటర్ల నీటిలో కలిపి పొలంలో నీటిని తీసివేసి కలుపు పై పడేలా పిచికారీ చేయాలి. అన్ని రకాల కలుపులను 20 రోజుల్లో బైస్పోరిబాక్ సోడియం 10 శాతం ద్రావకం 100 మిల్లీలీటర్లను ఎకరానికి పిచికారీ చేసి నివారించవచ్చు.

పొలంలో నేరుగా విత్తనాలు చల్లాలన్నా, మడులు కట్టి నారు పెంచాలన్నా పొలంలో సమృద్ధిగా నీరు ఉండాలి. అంతేకాక కూలీ సమస్య కూడా ఎదురవుతుంది. ఈ సమస్యలను పూర్తిగా అధిగమించేందుకు పొలాల్లో నేరుగా డ్రమ్ము సీడరుతో వరి విత్తనాలను నాటుకోవచ్చు. మొలకెత్తిన విత్తనం వేసేందుకు వీలున్న నాలుగు ప్లాస్టిక్ డబ్బాలను కలిపి, ప్రతి డబ్బాకు 20 సెంటీమీటర్ల దూరంలో రంధ్రాలు చేయాలి. పరికరం సులువుగా కదలడానికి ఇరువైపులా రెండు పెద్ద చక్రాలు ఏర్పాటుచేయాలి. దానిని లాగడానికి అనువుగా హ్యాండిల్‌ని కూడా ఏర్పాటు చేసుకోవాలి. ఇలా తయారు చేసిన తరు

యంత్రం పని చేసేది ఇలా..

వాత దీని బరువు 10 కిలోలను మించి ఉండదు. కొద్దిగా మొలకెత్తిన విత్తనాలను ఆ నాలుగు డబ్బాల్లో పోసి, దమ్ము చేసి, చదును చేసిన పొలాల్లో పెట్టి ముందుకు లాగడం ద్వారా విత్తనాలను నాటుకోవచ్చు. ఈ విధంగా చేయడం వల్ల ఎకరాకు 10 నుంచి 12 కిలోల విత్తనం సరిపోతుందన్నారు. ఇద్దరు మనుషులు మూడు గంటల్లో ఒక ఎకరం పొలంలో విత్తనాలు విత్తేందుకు అవకాశం ఉందన్నారు. ఒకసారి పరికరం లాగినప్పుడు 8 సాళ్లలో విత్తనం పడుతుంది. సాళ్ల మధ్య 20 సెంటీమీటర్ల ఎడం ఉంటుంది. పొలాన్ని సరిగా చదును చేయకపోతే ఈ పద్ధతిలో మొలక శాతం దెబ్బతిని మొక్కల సాంద్రత తగ్గుతుంది. విత్తనం విత్తేటప్పుడు పొలంలో బురద మాదిరిగా పదును ఉండి నీరు పలచగా ఉండాలి. విత్తిన తరువాత రెండు, మూడు రోజులకు ఒకసారి పలుచగా నీరు పెడుతూ మడి ఆరకుండా తొడిగే వరకు మొక్క నీటిలో మునగకూడదు. అవసరం అయినప్పుడు నీరు బయటకు పోయే విధంగా దార్లు తీసుకోవాలి. విత్తిన 15 రోజులకు మొదటి దఫా నత్రజని వేసే ముందు ఒత్తుగా ఉన్నచోట మొక్కలను తీసి ఖాళీలలో నాటుకోవడం మంచిది.

మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన



సీతానగరంలో జరిగే కార్యక్రమంలో మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ రాజు

సీతానగరం: గ్రామంలోని పువ్వాడ సత్యమాంబ ప్రభుత్వ హైస్కూల్లో మంగళవారం మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్ప్రభాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా మండల ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో 9, 10వ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఎస్.రాజు పాల్గొని మాదక ద్రవ్యాల వాడకంతో కుటుంబాలు విచ్ఛిన్నం అవుతాయన్నారు. డ్రగ్స్‌కి అలవాటు అయితే జీవితం నాశనమవుతుందన్నారు. సమాజంలో అశాంతి, అలజడులు చెలరేగే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మంచి మార్గంలో పయనించి, దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెడ్‌క్రాస్ సొసైటీ లైఫ్ మెంబర్ డాక్టర్ సత్యం రమేష్‌బాబు, ప్రధానోపాధ్యాయులు కన్నూరి సతీష్‌బాబు, ఉపాద్యాయులు శంకర్ రావు, సింహాద్రి, బ్రహ్మాజీ, తమ్మయ్య, రెడ్ క్రాస్ సిబ్బంది సుధాకర్, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుతో రైతన్నలకు మేలు

మధురపూడి: ఉద్యానవనాల సాగు రైతులకు లాభదాయకమని రుకొండ ఎంపీడీఓ వి.హేమ సుందరరావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉద్యాన, పండ్లు, పూలతోటల సాగు ద్వారా రైతులకు అధిక ఆదాయం పొందవచ్చన్నారు. ఉద్యానవనాలు మామిడి, జీడి మామిడి, సపోట, బత్తాయి, నిమ్మచ చింత, కొబ్బరి, సీతాఫలాలు, మునగ, దానిమ్మ, అంజూర, డ్రాగన్‌ఫ్రూట్,జామ, తైవాన్ జామ పండ్ల తోటలను విస్తృతం చేయాలన్నారు. వీటి సాగు నిర్వాహణ ఖర్చుగా పంట రకాన్ని బట్టి రూ.80 వేల నుంచి రూ.1.20లక్షల వరకూ ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఉపాధి హామీ పథకంలో నిధులు వెచ్చిస్తారన్నారు.

వచ్చే నెల 2న ట్రస్టు భూములకు కౌలు వేలం

గోకవరం: స్థానిక వీపీబీ శాస్త్రి ట్రస్టు భూములకు జులై 2న మధ్యాహ్నం 3 గంటలకు కౌలు వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ హేమకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీపీబీ శాస్త్రి ట్రస్టు సభ్యులు జిల్లా వైద్య ఆస్పత్రికి దానం చేసిన సర్వే నెంబర్ 10/1లో ఉన్న 2.57 ఎకరాలు, సర్వే నెంబర్ 245లో ఉన్న 0.71 ఎకరాలు, సర్వే నెంబర్ 249లో ఉన్న 2.74 ఎకరాలు, సర్వే నెంబర్ 236లో ఉన్న 3.97 ఎకరాలు కలిపి మొత్తంగా 10.05 ఎకరాల భూమికి పంట సాగు చేసుకోవడానికి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

28న ఆర్టీసీ రీజియన్ బహిరంగ వేలం

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక పార్సిల్ ఆఫీస్‌లో అన్ క్లెయిమ్డ్, అన్ ఐడెంటీపై పార్సిళ్లను ఈ నెల 28వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) మాధవ్ మంగళవారం తెలిపారు. ఈ బహిరంగ వేలం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు రాజమహేంద్రవరం బస్టాండ్‌లోని పార్సిల్ ఆఫీస్ వద్ద నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న ప్రజలు పాల్గొనవచ్చన్నారు.

సైన్స్ పరిశోధనపై గెస్ట్ లెక్చర్

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో సైన్స్ పరిశోధనపై మంగళవారం గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. మెటీరియల్ సైన్స్ పరిశోధన, ఇటీవల పోకడలు, ప్రాముఖ్యత, అవసరాలు అనే అంశంపై హైదరాబాద్‌కు చెందిన చైతన్య భారతి ఇనిస్ట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ షణ్ముఖ సమతం గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. జీవితంలో సైన్స్ ప్రాముఖ్యతను యూజీ, పీజీ విద్యార్థులకు వివరించారు. నానో టెక్నాలజీ, స్మార్ట్, బయో మెటీరియల్స్, కంప్యూటేషన్, ఎనర్జీ మెటీరియల్స్, స్పింట్రోనిక్స్, స్ప్రైరిమియన్‌ల ఫలితాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ కోమలిలక్ష్మి, డాక్టర్ ఈసూబ్ బాషా, డాక్టర్ బి.గౌరీనాయుడు, కె.వెంకటేశ్వరరావు, ఫిజిక్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత



సీతారామపురంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సర్పంచ్ మాధవి

రాజానగరం: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో చేపట్టే పారిశుధ్య వారోత్సవాలు నియోజకవర్గంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ప్రజారోగ్యంపై అవగాహన కలిగిస్తూ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామాలలో మంచినీటి ట్యాంకులను శుభ్రపర్చడం, క్లోరినేషన్ చేయడం, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వాటర్ పంపింగ్ కేంద్రాల వద్ద వాటర్ టెస్ట్ చేయడం, గ్రామాలలో పేరుకుపోయిన చెత్తచెదారాలను తొలగించడం, డ్రైన్లను శుభ్రపర్చడం, ఏఎన్ఎం, ఆశా వర్కర్ల ద్వారా ఇంటింటికీ వెళ్లి వైరల్ ఫీవర్స్ పై సర్వే నిర్వహించడం వంటి అనేక పనులు చేపట్టారు. ఆయా ప్రాంతాలలో పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది కలిసి పరిసరాల పరిశుభ్రత పై అవగాహన సదస్సులు నిర్వహించారు, ర్యాలీలు చేశారు.

గ్రామంలో పారిశుధ్య మెరుగుకు కృషి

రంగంపేట: గ్రామంలో పారుశుధ్య మెరుగుకు చర్యలు చేపట్టాలని సర్పంచ్ వేము మాధవి సూచించారు. మర్రిపూడి గ్రామంలోని సచివాలయం వద్ద మంగళవారం ఆమె పంచాయతీ, ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన కారణంగా సీజనల్ వ్యాధులు అయిన డయేరియా, డెంగీ, మలేరియా, విష జ్వారాలు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామంలో తక్షణమే అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, వాటర్ ట్యాంకులు శుభ్రం చేయాలని, క్లోరినేషన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి. గౌరీశాంతి, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తస్మాత్ జాగ్రత్త!

- పెరుగుతున్న దొంగతనాలు
- తాళం వేసి ఉన్న ఇళ్లే వారి టార్గెట్



బీరువాను బ్రేక్ చేసి, బంగారు, వెండి వస్తువులను, నగదును దోచుకుపోయిన దృశ్యం

రాజానగరం: తాళం వేసి ఉన్న ఇంటినే లక్ష్యంగా చేసుకుని చోరులు రెచ్చిపోతున్నారు. వారం రోజుల క్రితం స్థానిక వైఎస్సార్ కాలనీలో మూడు ఇళ్లలో తాళాలు బద్దలు కొట్టి, సుమారు రూ.ఆరు లక్షల విలువైన బంగారు, వెండి నగలు, కొంత నగదును అహరించుకుపోయిన సంగతి విధితమే. ఇదే తరహాలో వెలుగుబందలోని జగనన్న కాలనీలో ఒక ఇంటిలో దొంగలు పడి సుమారు ఏడు కాసుల బంగారు నగలు, కిలోన్నర వెండి వస్తువులు, రూ.20 వేలు నగదును దోచుకుపోయారు. రాజమహేంద్రవరంలోని పేదలకు గత ప్రభుత్వం పంపిణీ చేసిన ఇంటి స్థలాలో నిర్మించిన జగనన్న కాలనీలోని ఒక ఇంటిలో ఈ దొంగతనం జరిగింది. ఈ చోరీకి సంబంధించి బాధితురాలు బర్ల భవానీ స్థానిక పోలీసులకు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న వివరాలిలావున్నాయి. బంధువుల ఇంటికి పొరుగూరు వెళ్లి ఉదయమే తిరిగొచ్చిన భవానీ కుటుంబ సభ్యులు ఇంటి తలుపులు తెరచివుండడం చూసి కంగారుపడ్డారు. తలుపులకు వేసిన తాళాలు పగులకొట్టివుండడంతో లోనికి వెళ్లిన వారు నివ్వెరపోయారు. సంవత్సరాలు తరబడి కష్టపడి సంపాదించుకున్న బంగారు, వెండి వస్తువులతోపాటు నగదును బీరువాలో దాచుకుంటే ఏదీ వదలకుండా దుండగులు సర్వం దోచుకుపోయారంటూ లబోదిబోమన్నారు. ఈ మేరకు రాజానగరం పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేయడంతో క్ల్యూస్ టీమ్‌ని, వేలి ముద్ర నిపుణులను రప్పించి, దుంగడుల కోసం గాలిస్తున్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ఇల్లకు తాళం వేసుకుని గ్రామాంతరాలు వెళ్లే వారు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని సీఐ కాశీవిశ్వనాథ్ సూచించారు.

పిల్లల సమగ్ర అభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు దోహదం



రామేశ్వరంలో విద్యార్థులకు సర్టిఫికెట్లు, పట్టా ప్రదానం చేసిన అధికారులు

- మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణ

పెదపూడి: పిల్లల సమగ్ర అభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు దోహదపడతాయని మండల విద్యాశాఖాధికారి సీవీవీ సత్యనారాయణ అన్నారు. రామేశ్వరం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే మంగళవారం నిర్వహించారు. పెదపూడి సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను సమీప ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేర్పించే కార్యక్రమం చేపట్టారు. పూర్వ ప్రాథమిక విద్యార్థులకు ప్రీస్కూల్ సర్టిఫికెట్లు, పట్టా ప్రదానం అధికారుల చేతుల మీదుగా అందజేశారు. సెక్టార్ సూపర్ వైజర్ శ్రీగౌరీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాకినాడ అర్బన్ ప్రాజెక్ట్ సీడీపీఓ ఏ జ్యోతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో 6 రకాలైన అభివృద్ధి పథకాలు అందుతున్నాయన్నారు. కేంద్రాల్లో పిల్లవాడు మేధస్సు వికసిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.గంగాభవానీ, శ్రీనివాసు రావు, సూపర్‌వైజర్ పద్మావతి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు నిరోధించాలని కళాజాతా

బాల్య వివాహాలు నిరోధించాలని, లైంగిక వేధింపులు అరికట్టాలని అంగన్‌వాడీ శాఖకు చెందిన డప్పు కళాజాతా నిర్వహించారు. బేటీ బచావో, బేటి పడావో అనే కార్యక్రమంలో భాగంగా కళాజాతా నిర్వహించారు.

పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులు దూరం



సమావేశంలో పారిశుధ్య వారోత్సవాల్లో జాగ్రత్తలు వివరిస్తున్న వైద్య అధికారి

మధురపూడి: పారిశుధ్య వారోత్సవాలు సక్రమంగా నిర్వహించాలని, పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులు దూరమవుతాయని కోరుకొండ ఎంపీడీఓ వి.హేమసుందరరావు అన్నారు. మంగళవారం కోరుకొండ మండలం కాపవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్య–ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో వాటర్ ట్యాంకులను శుభ్రపర్చడం, కాలువల్లో పూడికలుతీత, రక్షిత మంచి నీరందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యాన్ని తొలగిస్తూ, గ్రామాలను శుభ్రంగా ఉంచేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. జులై 1 నుంచి ఆగస్టు 31 తేదీ వరకూ డయేరియా నివారణ మాసోత్సవాలు నిర్వహించాలన్నారు. డయేరియా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. ఈఓపీఆర్డీ మహేశ్వర ప్రతాప్, వైద్యులు శ్రీవల్లీ, కోటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, వైద్యశాఖ సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా పోలీసు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ వరిసాగులో మెళకువలపై శిక్షణ



సమావేశంలో మాట్లాడుతూ శాస్త్రవేత్త నరసింహారాజు

పెదపూడి: శాస్త్రీయ వ్యవసాయ విధానాలను అవగాహన చేసుకుని కొద్దిపాటి మెళకువలను ఆచరిస్తే ఖరీఫ్ వరిసాగులో స్థిరమైన, నాణ్యమైన దిగుబడి సాధించవచ్చని తూర్పు గోదావరి జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు తెలిపారు. మంగళవారం అనపర్తి ఏడీఏ కృష్ణ అధ్యక్షతన రైతు సదస్సు నిర్వహించారు. డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ ప్రస్తుతం సార్వా వరి నారుమడి దశలో ఉందని, కొన్ని చోట్ల నాట్లు కూడా ప్రారంభమయ్యాయన్నారు. ఎక్కువగా స్వర్ణ ఎంటీయూ 1328 రకాలు సాగు చేస్తున్నారన్నారు. రైతులు విత్తనశుద్ధిలో కిలో విత్తనానికి కార్బండజిమ్, మాంకోజెబ్ మిశ్రమ శిలీంద్రనాశనని 2 గ్రాములు చొప్పున లీటరు నీటిలో కలుపుకొని విత్తనానికి పట్టించాలని, దానివల్ల పంట తెగుళ్లు బారిన పడకుండా ఉంటుందన్నారు. నారు తీసే వారం రోజుల ముందు కార్బోఫ్యూరాన్ గుళికలను సెంటు నారుమడికి 160 గ్రాములు చొప్పున చల్లినట్లయితే ప్రధాన మడిలో కాండం తొలుచు పురుగు నివారిచవచ్చన్నారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ పి.అమ్మాజీ మాట్లాడుతూ వరిలో కలుపు నివారణపై వివరించారు. డాక్టర్ హైమాజ్యోతి మాట్లాడుతూ వరిలో రకాలు, మార్కెటింగ్, లాభదాయక పంటలు గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవయ అధికారులు సూరేష్, శామ్యూల్, గ్రామ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

కంబాలచెరువు: ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ఏడో తరగతి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ కోరింది. ఈ మేరకు మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వై.భాస్కర్ మాట్లాడుతూ ఏడో తరగతి విద్యార్థులకు తొందరగా పాఠ్య పుస్తకాలను అందించాలని, కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో నోట్ పుస్తకాలు అమ్మడం అరికట్టాలన్నారు. నోట్ పుస్తకాల పేరుతో వేల ఫీజులు దోపిడీ చేస్తున్నారని, పుస్తకాలు అమ్మే స్కూల్స్ అనుమతులు రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వి.రాంబాబు, జిల్లా సహాయక కార్యదర్శి కె.జ్యోతి, జిల్లా కమిటీ సభ్యులు నిశ్చల్ పాల్గొన్నారు.

నైపుణ్యశిక్షణతో మహిళల ఆర్థికాభివృద్ధి

రాజమహేంద్రవరం సిటీ: మహిళలు స్వయం వృద్ధి సాధించాలంటే నైపుణ్యం ఉన్న వృత్తులు ఎంతగానో ఉపయోగపడతాయని ఓఎన్‌జీసీ జనరల్ మేనేజర్ గోకాడ చంద్రశేఖరరావు అన్నారు. మంగళవారం స్థానిక లాలాచెరువులోని స్వర్ణాంధ్ర ఉచిత కుట్టు, మగ్గం వర్క్ శిక్షణా కేంద్రంలో జరిగిన 72వ బ్యాచ్ ముగింపు ఉత్సవంలో చంద్రశేఖరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖరరావు మాట్లాడుతూ మహిళలు కష్టపడి సంపాదించిన మొత్తాలు పొదుపు చేయడం వల్లే, కుటుంబాలు ఆర్థికంగా నిలబడగడుగుతున్నాయన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో భార్యాభర్తలిద్దరూ కష్టపడి సంపాదిస్తేనే కుటుంబం గౌరవంగా బ్రతికే వీలుందని అందరూ చేతి వృతులు నేర్చు కోవాలని కోరారు. ఇంటిలో ఉండే మగ్గం, కుట్టు పని ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఎక్కువగా ఉందన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

రాజమహేంద్రవరం రూరల్: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులందరూ భాగస్వాములు కావాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగలి గోపీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం శాటిలైట్ సిటీ గ్రామం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నెం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఒక చెట్టు–అమ్మ కోసం(ఏక్ పేడ్ – మా కే నామ్) కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.

ఆకాశం.. అరుణారుణం



సాయంత్రం 6.47 గంటల సమయంలో ...

రాజానగరం: ఆస్వాదించే మనస్సు ఉండాలేగానీ ఏ చిత్రకారుడు చిత్రీకరించని ఎన్నో అందాలను ప్రకృతి మనకు నిరంతరం చూపిస్తూనే ఉంటుంది. ముఖ్యంగా ఉదయించే సూర్యుడు ఆకాశాన వెలుగు పంచుతూ కనిపిస్తాడు. అలాగే సూర్యస్తమయంలో తన కిరణాలతో ఎన్నో రంగులు, అందాలతో మైమరపిస్తాడు. మంగళావారం రాజానగరంలో సంధ్యాసమయాన ఆకాశంలో సూర్యుడు ఎరుపు పసుపు వర్ణంలో చింతనిప్పులు చిందిస్తున్నట్టు దర్శనమిచ్చే దృశ్యాలే అందరినీ ఆకట్టుకున్నాయి.